# యాదగిరిగుట్టలో నిత్యారాధనలు

- సంప్రోక్షణం, ప్రాయశ్చిత హోమంతో ఆలయ శుద్ధి


నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, అక్టోబర్ 29 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి నిత్యారాధనలు ఘనంగా జరిగాయి. ఆదివారం తెల్లవారుజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సంప్రోక్షణం చేపట్టారు. పాక్షిక చంద్రగ్రహణం సందర్భంగా శనివారం సాయంత్రం 4 గంటలకు ఆలయాన్ని మూసిన అర్చకులు, అధికారులు ఆదివారం తెల్లవారుజామున ఆలయాన్ని తెరిచి సంప్రోక్షణం, ప్రాయశ్చిత హోమంతో ఆలయాన్ని శుద్ధి చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు సుప్రభాత సేవ చేపట్టి బిందె తీర్థం, స్వామివారి బాలభోగం నిర్వహించారు. స్వామివారికి నిజాభిషేకం, సహస్రనామార్చనలు, అమ్మవారికి కుంకుమార్చనలు శాస్త్రోక్తంగా జరిగాయి. అనంతరం భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శనభాగ్యం కల్పించారు. స్వామి, అమ్మవార్ల నిత్య సుదర్శన నారసింహ హోమం, నిత్య తిరుకల్యాణోత్సవం అత్యంత వైభవంగా జరిగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు సువర్ణ పుష్పార్చనలు కొనసాగాయి. సాయంత్రం స్వామివారికి వెండి మొక్కు జోడు సేవలు, దర్బార్ సేవ, తిరువారాధన అత్యంత వైభవంగా చేపట్టారు. నారసింహుడికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయ స్వామికి సహస్రనామార్చన జరిపారు. స్వామివారిని 16వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. ఆలయ ఖజానాకు రూ.24,03,061 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈఓ గీత తెలిపారు.


ఆలయంలో క్యూలైన్‌లో భక్తులు

# తిరుమలగిరి జనసంద్రం

- తండోపతండాలుగా తరలొచ్చిన జనం
- తుంగతుర్తి సమరశంఖారావ సభ గ్రాండ్ సక్సెస్

నల్లగొండ ప్రతినిధి, అక్టోబర్29(నమస్తే తెలంగాణ)/తిరుమలగిరి తిరుమలగిరిలో జరిగిన ఆదివారం జరిగిన తుంగతుర్తి సమరశంఖారవం బహిరంగసభ విజయవంతమైంది. పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ పాల్గొన్న ఈ సభకు ఊహించిన దాని కంటే జనం తండోపతండాలుగా తరలివచ్చారు. తిరుమలగిరి పట్టణమంతా ఎటూ చూసినా జన ప్రభంజనమే కనిపించింది. మధ్యాహ్నం 12 గంటల నుంచి మొదలైన జన ప్రవాహం సాయంత్రం సభ ముగిసే వరకు కొనసాగింది. నియోజకవర్గం నలూమూలల నుంచి తిరమలగిరికి చేరుకునే అన్ని రహదారులు గులాబీమయమయ్యాయి. ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం మధ్యాహ్నం తిరుమలగిరిలో ఏర్పాటు చేసిన సమరశంఖారావం సభ ఆద్యంతం జోరుగా హుషారుగా సాగింది. సభలో పెద్ద ఎత్తున యువత భాగస్వాములు కావడం విశేషం. చిన్నపెద్దా, ఆడ, మగ తేడా లేకుండా అన్ని వర్గాల ప్రజలు బహిరంగసభకు తరలివరావడంతో సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం కావాలి..కిశోర్ హ్యాట్రిక్ ఎమ్మెల్యే కావాలి..అంటూ కళాకారులు నినదిస్తే..సభా ప్రాంగణం అరుపులు, కేకలతో దద్దరిల్లిపోయింది. సీఎం కేసీఆర్ అండదండలతో జిల్లా మంత్రి జగదీశ్‌రెడ్డి మార్గదర్శనంలో తుంగతుర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ ప్రకటించారు. ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అధ్యక్షతన తిరుమలగిరిలో ఆదివారం మధ్యాహ్నం తుంగతుర్తి సమర శంఖరావం బహిరంగసభ జరిగింది. ఈ సభకు అధినేత, సీఎం కేసీఆర్ ముఖ్య అతిథిగాహాజరయ్యారు. కోదాడలో సభలో పాల్గొన్న కేసీఆర్ హెలిక్యాప్టర్‌లో జిల్లా మంత్రి జగదీశ్‌రెడ్డితో కలిసి మధ్యాహ్నం 3.50 గంటలకు తిరుమలగిరి చేరుకున్నారు. వీరికి ఎమ్మెల్యే కిశోర్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. నేరుగా సీఎం కేసీఆర్ సభావేదికపైకి చేరుకోవడంతో సభికులంతా ఒక్కసారిగా చప్పట్లు, ఈలలు, కేకలతో స్వాగతించారు. అంతుకు ముందు నియోజకవర్గ వ్యాప్తంగా తరలివచ్చిన జనంతో సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. సూర్యాపేట- జనగాం హైవే పక్కనే ఏర్పాటు చేసిన సభా స్థలంతో పాటు బయట కూడా వేలాది మంది జనంతో జనప్రభంజనాన్ని తలపించింది.

### యువత ప్రత్యేక ఆకర్షణ

సమరశంఖారావం బహిరంగసభకు పెద్ద సంఖ్యలో తరలివచ్చిన యువత ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సభా వేదికకు ఎదురుగా అన్ని వైపులా యువత భారీగా సందడి చేశారు. కిశోర్‌కుమార్ యువ ఎమ్మెల్యే కావడం... ఆయనకు ఎక్కడికెళ్లినా యువతతో మంచి సం బంధాలు ఉండడంతో ఆ ప్రభావమంతా సభలో కనిపించింది. దాంతో సభలో కూడా ఆద్యంతం యువత జోష్ స్పష్టమైంది. మిట్టపల్లి సురేందర్ ఆధ్వర్యంలో సాగిన ఆటాపాటాలకు యువత చేసిన సందడి మా మూలు కాదు. కిశోర్ ప్రసంగ సమయంలోనూ, సీఎం కేసీఆర్ ప్రసంగ సమయంలోనూ కేరింతలు, ఈలలు, నినాదాలతో యువత స్పందించడం విశేషం. ప్రారంభంలో కేసీఆర్ సైతం యువత కేరింతలు ఆపాలని కోరగా ఎమ్మెల్యే కిశోర్ వీళ్లను సైగలతో వద్దంటూ ఆపాల్సివచ్చింది. కిశోర్‌కుమార్‌ను లక్ష మెజార్టీతో గెలిపించాలని కోరినప్పుడు సభా ప్రాంగణమంతా కేరింతలతో దద్దరిల్లింది. సభా లోపల, బయట కూడా యువత భాగస్వామ్యం పెద్ద ఎత్తున ఉండడంతో యువతలో కిశోర్‌కుమార్‌కు ఉన్న అభిమానం వెల్లడైంది.

## పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

బొడ్రాయిబజార్, అక్టోబర్ 29 : గతంలో సూర్యాపేటలో ఉన్న రాజా బహుద్దూర్ వెంకట్రాంరెడ్డి ఉన్నత పాఠశాలలో 1995-96 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం స్థానిక తిరుమలగ్రాండ్ హోటల్‌లో సమ్మేళనం నిర్వహించారు. 26 ఏండ్ల క్రితం చదువుకున్న వారంతా ఒకే చోట చేరి తమ పాఠశాల నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తమకు చదువు నేర్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు అలువాల నందకిశోర్, షేక్ జహీర్, ఎస్ఎస్ఆర్. ప్రసాద్, డాక్టర్ రవీందర్, ఎండీ షరీఫ్, కొణతం జగన్‌రెడ్డి, రహీమ్, శ్రవంతి, యోగిత, విజయలక్ష్మి, రమ్య, ఆర్.కల్పన, శ్వేత, రాచర్ల కల్పన, శ్రీలత పాల్గొన్నారు.


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు


బీఆర్ఎస్‌లో చేరిన వారితో ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి

# బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి

- మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి
- బీజేపీ,కాంగ్రెస్, బీఎస్పీ నుంచి 40 మంది బీఆర్ఎస్‌లో చేరికలు

సంస్థాన్ నారాయణపురం, అక్టోబర్ 29 : బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి అన్నారు. మండలంలోని బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీ, సీపీఐ నుంచి 40 మంది కార్యకర్తలు బీఎస్పీ మండలాధ్యక్షుడు వంగూరి శ్రీశైలం యాదవ్, ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు చెప్పారు.

కార్యక్రమంలో సర్పంచ్ సుర్వి యాదయ్య, పీఏసీఎస్ చైర్మన్ జక్కిడి జంగారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు కూసుకుంట్ల సత్తిరెడ్డి, మన్నె ఇంద్రసేనా రెడ్డి, జక్కిడి దన్వంతరెడ్డి, పల్లె గోవర్ధన్ రెడ్డి, వీరమళ్ల వెంకటేశం, భాస్కర్ రెడ్డి, గడ్డం నరేశ్, మునుగోడు అధ్యక్షుడు నలపరాజు రమేశ్ పాల్గొన్నారు.

# మునుగోడులో కూసుకుంట్లదే విజయం

- బీఆర్ఎస్ మర్రిగూడ మండలాధ్యక్షుడు శంకర్ యాదవ్


మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శంకర్ యాదవ్

మర్రిగూడ,అక్టోబర్ 29 : మునుగోడు ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డిదే విజయమని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తోటకూరి శంకర్ యాదవ్ అన్నారు.స్థానిక బీఆర్ఎస్ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కోమటి రెడ్డి రాజగోపాల్‌రెడ్డి ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. స్వార్థపూరిత రాజకీయాలు చేసే రాజగోపాల్ రెడ్డికి మునుగోడు ఓటర్లు బుద్ధి చెప్పాలన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలోనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్నారు. నిత్యం ప్రజల మధ్యన ఉండే కూసుకుంట్లను మరోసారి గెలిపిస్తే అభివృద్ధి పనులు నిరాటంకంగా కొనసాగుతాయని పేర్కొన్నారు. సమావేశంలో సర్పంచ్ నల్ల యాదయ్య, ఎస్ఎంసీ చైర్మన్ పందుల కృష్ణ గౌడ్, మండల ఆర్గనైజింగ్ సెక్రెటరీ కొల్కులపల్లి యాదయ్య, నాయకులు రాచకొండ యాదయ్య, బండ రమేశ్, గునగంటి వెంకటేశ్ గౌడ్, ఎడ్ల ముత్తయ్య, పిట్టల కృష్ణ ముదిరాజ్, కొండాపురం నరేశ్, చాట వెంకటయ్య, మహేశ్వరం రమేశ్ పాల్గొన్నారు.


శాలిగౌరారం ప్రాజెక్టులో చేప పిల్లలు వదులుతున్న అధికారులు

## చేప పిల్లల పంపిణీ

శాలిగౌరారం, అక్టోబర్ 29 : మత్స్య కార్మికుల సంక్షేమం కోసం ఉచితంగా పంపిణీ చేస్తున్న చేప పిల్లలను సద్వినియోగం చేసుకోవాలని మత్స్య కార్మిక అధికారులు అన్నారు. ఆదివారం శాలిగౌరారం ప్రాజెక్టులో చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాజెక్టులో 8 చేపల సీడును వదిలినట్లు తెలిపారు. కార్యక్రమంలో మత్స్య సంఘం నాయకులు పాల్గొన్నారు.